సాక్షి
అన్నమయ్య జిల్లా

గురువారం । 27 । ఏప్రిల్ । 2023



బ్రహ్మంగారిమఠం.. శోభాయమానం

బ్రహ్మంగారిమఠంలోని వీరబ్రహ్మేంద్ర స్వామి క్షేత్రం స్వామి ఆరాధన సందర్భంగా నూతన శోభ సంతరించుకుంది. - 8లో



కోడిపుంజుకోసం వెళ్లి వస్తూ...

స్నేహితుడి దగ్గర కోడి పుంజు కోసం వెళ్లి తిరుగు ప్రయాణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సయ్యద్ మస్తాన్ (30) అనే యువకుడు మృతి చెందాడు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.72	రూ.106
రెండోరకం	రూ.50	రూ.70

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 401 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి



ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో నిర్మాణంలో ఉన్న భవనాలను పరిశీలిస్తున్న ఆర్‌ఎం రాము

రాయచోటిటౌన్ : రాయచోటి ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో జరుగుతున్న భవన నిర్మాణ పనులను ఆర్టీసీ ఆర్‌ఎం రాము బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అదనంగా భవనాలు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం రూ.1.8 కోట్ల నిధులు విడుదల చేసింది. ఈ మేరకు పనులు కూడా వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ పనులను ఆయన పరిశీలించిన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన డీఎం ధనుంజయతో మాట్లాడుతూ మిగిలిన పనులను త్వరగా పూర్తి చేసేలా కాంట్రాక్టర్‌కు సూచించాలని చెప్పారు.

గవర్నర్ పర్యటన ఇలా..

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ శుక్రవారం జిల్లా పర్యటనకు వస్తున్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 3.00 గంటలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 3.10 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 3.40 గంటలకు ఒంటిమిట్ట టీటీడీ గెస్ట్ హౌస్‌కు చేరుకుంటారు. అక్కడ కాసేపు విశ్రాంతి తీసుకుని 3.50 గంటలకు గెస్ట్‌హౌస్ నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 3.55 గంటలకు ఒంటిమిట్ట శ్రీకోదండ రామస్వామి ఆలయానికి వెళతారు. దర్శనం అనంతరం అక్కడి నుంచి బయలుదేరి సాయంత్రం 5.00 గంటలకు కడప పెద్దదర్గాకు చేరుకుంటారు. దర్గాను సందర్శించిన తర్వాత 5.30 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 5.40 గంటలకు కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 5.45 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి రేణిగుంటకు బయలుదేరి వెళతారు.

మెడికల్ అండ్ హెల్త్ ఆర్డీ కోటేశ్వరికి పదోన్నతి

కడప రూరల్: కడపలోని వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం రీజనల్ డైరెక్టర్ డాక్టర్ కోటేశ్వరికి అడిషనల్ డైరెక్టర్‌గా పదోన్నతి లభించింది. ఈమె 2017 నవంబర్ నుంచి కడప కేంద్రంగా జోనల్ మలేరియా అధికారిగా బాధ్యతలు చేపడుతున్నారు. 2022 ఏప్రిల్ నుంచి వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం ఇన్‌చార్జి రీజనల్ డైరెక్టర్‌గా విధులను నిర్వహిస్తున్నారు. తాజాగా రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ విభాగంలో అడిషనల్ డైరెక్టర్ (ఎయిడ్స్ అండ్ లెప్రసీ)గా పదోన్నతి లభించింది. ఆమె అమరావతిలో బాధ్యతలను స్వీకరిస్తారు.

రిజర్వేషన్‌ను వినియోగించుకోవాలి

సిద్దవటం: స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరిన ప్రతి విద్యార్థి ప్రభుత్వం కల్పించే రిజర్వేషన్‌లను ఉపయోగించు కోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. సిద్దవటం మండలంలోని పార్వతీపురం గ్రామంలో ఉన్న ఎస్.పి.బి.వి.డి. సభా హైస్కూల్(ఎయిడెడ్)లో స్కౌట్ యూనిట్‌ను ప్రారంభించారు.

ఇంటర్ ఫలితాల్లో బాలికలదే హవా

- ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లోనూ వారిదే పైచేయి
- ప్రథమ సంవత్సరం ఫలితాల్లో రాష్ట్రంలో చిట్టచివరి స్థానం
- ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో చివరి నుంచి రెండో స్థానం
- ఫస్ట్ ఇయర్‌లో 46 శాతం, సెకండియర్‌లో 60 శాతం ఉత్తీర్ణత
- ఫలితాల పరంగా గత ఏడాది కంటే కొంత మెరుగు



కడప ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్‌కు సంబంధించి ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలను బుధవారం రాష్ట విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ విజయవాడలో విడుదల చేశారు. అయితే ఫలితాల పరంగా ఉమ్మడి వైఎస్సార్ జిల్లా రాష్ట్రంలో చిట్టచివరి స్థానంలో నిలిచింది. ఇందులో ప్రథమ సంవత్సరంలో 46 శాతం మేర ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో చిట్టచివరి స్థానంలో నిలువగా, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 60 శాతం మేర ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో చివరి నుంచి రెండో స్థానం దక్కించుకుంది. ఈ సారి ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ ఫలితాల్లో కూడా బాలికలదే పైచేయిగా నిలిచింది.

ఉమ్మడి జిల్లాలో 92 పరీక్షా కేంద్రాలు..

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో 92 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో 23 ప్రభుత్వ కళాశాలలు, 4 ఎయిడెడ్ కళాశాలలు, 5 గురుకుల పాఠశాలలు, 2 మోడల్ స్కూల్స్, 57 ప్రైవేటు జూనియర్ కళాశాలలతోపాటు ఒక హైస్కూల్ ప్లస్‌ను సిద్ధం చేశారు. ఈ పరీక్షా కేంద్రాలలో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 18,839 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 17,056 ఇలా మొత్తం 35,895 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాశారు. ఈ పరీక్షలను 92 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 92 మంది డిపార్టుమెంట్ అధికారులతోపాటు 4 ఫ్లైయింగ్ స్క్వాడ్, 10 సిట్టింగ్ స్క్వాడ్, 10 మంది సెంటర్ కస్టోడియన్‌లు పర్యవేక్షించారు.

ప్రథమ సంవత్సరానికి సంబంధించి..

ఈ ఏడాది నిర్వహించిన ప్రథమ సంవత్సరం పరీక్షలను జిల్లా వ్యాప్తంగా 18,839 మంది రాయగా ఇందులో 8603 మంది పాసై 46 శాతం మేర ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బాలురు 8702 మంది పరీక్ష రాయగా 3494 మంది పాసై 40 శాతం మేర ఉత్తీర్ణత పొందారు. అలాగే 10137 మంది బాలికలు పరీక్ష రాయగా 5109 మంది పాసై 50 శాతం మేర ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బాలురకంటే బాలికలే అధిక ఉత్తీర్ణత శాతాన్ని సాధించి భేష్ అనిపించుకున్నారు.

ద్వితీయ సంవత్సరానికి సంబంధించి..

ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఈ ఏడాది 17056 మంది విద్యార్థులు పరీక్ష రాయగా ఇందులో 10230 మంది పాసై 60 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇందులో బాలురు 7568 మంది పరీక్ష రాయగా ఇందులో 4093 మంది పాసై 54 శాతం ఉత్తీర్ణత సాధించారు. 9488 మంది బాలికలకు గాను 6137 మంది పాసై 65 శాతం మేర ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సర ఫలితాల్లో కూడా బాలికలే సత్తా చాటారు.

యాజమాన్యాల వారీగా వివరాలు

కేటగిరి	కళాశాలలు	హాజరైనవారు	పాస్	ఉత్తీర్ణతశాతం
ప్రథమ సంవత్సరానికి సంబంధించి..				
ప్రభుత్వ	28	2786	799	29
ఎయిడెడ్	07	471	49	10
హైస్కూల్‌ప్లస్	08	161	06	4
మోడల్ స్కూల్స్	10	745	258	35
బీసీ వెల్ఫేర్	01	117	102	87
కేజీబీవీ	27	580	150	26
కోఆపరేటివ్	01	82	12	15
ప్రైవేటు	94	12984	6842	53
మొత్తం	193	18839	8603	46
ద్వితీయ సంవత్సరానికి సంబంధించి..				
ప్రభుత్వ	28	2828	1267	45
ఎయిడెడ్	07	462	99	21
మోడల్ స్కూల్స్	10	723	321	44
బీసీ వెల్ఫేర్	01	139	120	86
కేజీబీవీ	27	683	254	37
కోఆపరేటివ్	01	106	46	43
ప్రైవేటు	93	11135	7529	68
మొత్తం	184	17065	10230	60

సంతృప్తికరంగా ఫలితాలు



ఇంటర్ పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహించాము. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. ఫలితాలు అనుకున్న మేర రాకున్నా వచ్చిన ఫలితాలు సంతృప్తి కరంగా ఉన్నాయి. – రమణరాజు, ఆర్‌ఐఓ, ఇంటర్మీడియట్

కాంట్రాక్టు కార్మికుడి కూతురు.. కాలేజీ టాపర్



కేశవ ప్రియ

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి మార్కులు సాధించారు. వై కోడూరు గ్రామానికి చెందిన వల్లెపు మౌలాలి కుమార్తె వల్లెపు కేశవప్రియ ఎంపీసీ గ్రూపులో ఇంటర్ సెకండియర్ ఫలితాల్లో 1000 మార్కులకు గాను 960 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచింది. బాలిక తండ్రి మౌలాలి జువారి సిమెంట్ కర్మాగారంలో కాంట్రాక్టు కార్మికుడిగా పని చేస్తున్నాడు. అలాగే బైపీసీలో మెహబూబ్ అనే విద్యార్థిని 1000 మార్కులకు 960 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపల్ తెలిపారు.

పేదింటి బిడ్డ ..చదువులో దిట్ట



తల్లిదండ్రులతో నవ్యదీపిక

మదనపల్లె సిటీ: అమ్మాయి తండ్రి ఆటోడ్రైవర్. తల్లి సాధారణ గృహిణి. ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీలో చదివి ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో చామంతుల నవ్యదీపిక బైపీసిలో 978 మార్కులు సాధించింది. దీంతో అందరి మన్ననలు పొందింది. మదనపల్లె పట్టణం త్యాగరాజవీధికి చెందిన నాగమోహన్ కుమార్తె నవ్యదీపిక పదో తరగతి స్థానిక హోప్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో చదివింది. బాలికను ప్రిన్సిపాల్ బాలకృష్ణమూర్తి, అధ్యాపకులు అభినందించారు.

గైనకాలజిస్టవుతా: గైనకాలజిస్టు కావడమే నా లక్ష్యం. పేదలకు వైద్య సేవలు అందిస్తా. తల్లిదండ్రులు, అధ్యాపకుల పేరు నిలబెడతా. అధ్యాపకులు తగిన సలహాలు, సూచనలు ఇవ్వడంతోనే మంచి మార్కులు సాధించాను. –నవ్యదీపిక

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సైతం..

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంటర్ పరీక్ష ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎప్పటిలానే ఈ ఏడాది కూడా జనరల్, ఒకేషనల్‌లో బాలికలే పైచేయి సాధించారు. మొదటి సంవత్సరం పరీక్షకు 43,713మంది విద్యార్థులు హాజరవగా, 24,425 మంది (56శాతం) ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరం పరీక్షకు 36,028 మంది హాజరవగా, 25,783మంది (72శాతం) ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ఫస్టియర్‌కు సంబంధించి ఉమ్మడి చిత్తూరు జిల్లా రాష్ట్రంలో 8వ స్థానంలో నిలిచింది. అలాగే సెకండియర్ ఫలితాల్లో 4వ స్థానం దక్కించుకుంది.

ఒకేషనల్‌లోనూ బాలికలదే హవా..

ఇంటర్ ప్రథమ సంవత్సరం ఒకేషనల్ పరీక్షకు 3,131మంది హాజరవగా, 1,166 మంది (37శాతం), ద్వితీయ సంవత్సరం పరీక్షకు 2,628మంది హాజరవగా, 1,394మంది(53 శాతం) విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఫస్టియర్‌లో బాలురు 25శాతం, బాలికలు 51శాతం, సెకండియర్‌లో బాలురు 39శాతం, బాలికలు 69శాతం ఉత్తీర్ణత సాధించారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

- లేఅవుట్లలో మౌలికవసతులు కల్పించాలి
- జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

మదనపల్లె : నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న హౌసింగ్ లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్. సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం మదనపల్లె సబ్‌కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఆర్డీఓ ఎం.ఎస్.మురళీతో కలిసి జగనన్న హౌసింగ్ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న హౌసింగ్ ఇళ్ల నిర్మాణాల్లో వేగవంతం చేయాలని, నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇళ్ల నిర్మాణాల్లో రోజురోజుకు ప్రగతి కనిపించేలా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. లేఅవుట్లలో విద్యుత్, నీటివసతి ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మదనపల్లె నియోజకవర్గంలో మదనపల్లె, రామసముద్రం, నిమ్మనపల్లె మండలాల్లోని మొత్తం 73 లేఅవుట్లలో 7,777 ఇళ్లు మంజూరు కాగా, 1,073 ఇళ్లు పూర్తయ్యాయన్నారు. 145 ఇళ్లు ఇప్పటివరకు ప్రారంభించలేదన్నారు. వీటిని సత్వరమే ప్రారంభించి పునాది స్థాయికి తీసుకురావాలన్నారు. నియోజకవర్గంలోని 10 లేఅవుట్లలో నీటివసతి లేదని, 15 రోజుల్లోపు నీటిసౌకర్యం కల్పించాలన్నారు. మే5లోపు అన్ని లేఅవుట్లలో విద్యుత్ సదుపాయం కల్పించాలన్నారు. అలాగే టిడ్కో ఇళ్లకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. టిడ్కో ఇళ్లలో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్, నీటిసరఫరా తదితర మౌలికవసతులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాలను ప్రతి ఒక్కరూ సీరియస్‌గా తీసుకుని లేఅవుట్ల వారీగా ఇచ్చిన లక్ష్యాలను పూర్తిచేయాలన్నారు. ఎమ్మెల్యే నవాజ్‌బాషా మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు దేశచరిత్రలోనే మరే రాష్ట్రంలో లేని విధంగా లక్షల సంఖ్యలో ఇళ్లు మంజూరు చేశారన్నారు. ఎప్పటికప్పుడు ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్ష చేస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి ఆశయం నెరవేర్చే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేసి ఇళ్ల నిర్మాణాలు సకాలంలో పూర్తయ్యేలా చూడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సతీష్‌కుమార్, ట్రాన్స్‌కో ఈఈ రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల, హౌసింగ్ డీఈ రామస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి సమష్టి కృషి

కడప సెవెన్‌రోడ్స్: ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం తన చాంబర్‌లో నిర్వహించిన జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషికి చేయూతనివ్వడం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే ఎప్పటికప్పుడు పరిష్కారం అయ్యేందుకు ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళతామన్నారు. గ్రామీణాభివృద్ధిపై జరిగిన సమీక్షలో కో ఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా మాట్లాడుతూ ఒంటరి మహిళలకు, పక్షవాతంతో బాధపడుతున్న వారికి పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. ఈ దశలో జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ పెన్షన్ల మంజూరు విషయంలో అధికారులు సానుకూలంగా స్పందించాలని కోరారు. అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రతినెలా క్రమం తప్పకుండా మెగా జాబ్‌మేళాలు నిర్వహించాలని ఎంప్లాయ్‌మెంట్ అధికారికి సూచించారు. హౌసింగ్‌పై జరిగిన చర్చ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను కోరారు.

ఉమ్మడి జిల్లాలో డీఎస్పీల బదిలీ



ఎస్ఎండి షరీఫ్



ఆర్. వాసుదేవన్



పి.కంజాక్షన్



బి.వెంకటశివారెడ్డి



వినోద్‌కుమార్

- కడపకు ఎస్ఎండి షరీఫ్
- రాయచోటికి ఎస్.మహబూబ్ బాషా



వి.ఎస్.కె. చైతన్య

కడప అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా 77 మంది డీఎస్పీలను వివిధ సబ్‌డివిజన్‌లకు, స్థానాలకు బదిలీ చేస్తూ డీజీపీ కె.వి. రాజేంద్రనాథ్ రెడ్డి ఈనెల 25న ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో పలువురు డీఎస్పీలు బదిలీ అయ్యారు.

- కడప డీఎస్పీగా ఎస్ఎండి షరీఫ్ నియమితులయ్యారు. 1995 బ్యాచ్‌కు చెందిన ఈయన జిల్లాలో ఎస్ఐగా, సీఐగా పనిచేశారు. ప్రస్తుతం తిరుపతి పీటీసీలో విధులు నిర్వహిస్తున్నారు. కడప ఇన్‌చార్జి డీఎస్పీగా పనిచేస్తున్న ఎస్బీ డీఎస్పీ బి. వెంకట శివారెడ్డిని అనంతపురం రూరల్ డీఎస్పీగా బదిలీ చేశారు.
- కడప దిశ డీఎస్పీగా పనిచేస్తున్న ఆర్. వాసుదేవన్‌ను పుట్టపర్తికి, జమ్మలమడుగు డీఎస్పీ ఎన్. నాగరాజును కడప ఏసీబీకి, సత్యసాయి జిల్లా ఎస్బీ డీఎస్పీ ఉమామహేశ్వర్ రెడ్డిని జమ్మలమడుగుకు. కడప ఏసీబీ డీఎస్పీ కంజాక్షన్‌ను హిందూపురానికి, ఆదోని డీఎస్పీ వినోద్‌కుమార్‌ను పులివెందులకు బదిలీ చేశారు.
- అలాగే తాడిపత్రి డీఎస్పీగా పనిచేస్తున్న వి.ఎస్.కె. చైతన్యను రాజంపేటకు, అనంతపురం సీసీఎస్ డీఎస్పీగా పనిచేస్తున్న ఎస్. మహబూబ్‌బాషాను రాయచోటికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

- జగనన్న వసతిదీవెన పథకాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లాలో 34,836 విద్యార్థులకు చెందిన 31,846 మంది తల్లుల బ్యాంకు ఖాతాలకు రూ.33.72 కోట్లు జమ
- వసతిదీవెన పథకం కార్యక్రమంలో కలెక్టర్ గిరీషా పీఎస్



విద్యార్థులు, వారి తల్లులకు మెగా చెక్కును అందజేస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : జగనన్న వసతి దీవెన పథకంతో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. బుధవారం అనంతపురం జిల్లా నార్పల బహిరంగ వేదిక నుంచి జగనన్న వసతి దీవెన పథకం కింద రూ.912.71 కోట్ల ఆర్థిక సహాయాన్ని కంప్యూటర్ బటన్ నొక్కి నేరుగా అర్హులైన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జమ చేశారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి కలెక్టర్ గిరీషా పీఎస్, డీఆర్‌ఓ సత్యనారాయణ, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి జాకీర్‌హుస్సేన్, జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ సందప్ప, విద్యార్థులు, విద్యార్థుల తల్లులు పాల్గొన్నారు. ఈ పథకం కింద అన్నమయ్య జిల్లాలో 34,836 మంది విద్యార్థులకు చెందిన 31,846 మంది తల్లుల బ్యాంకు ఖాతాలకు రూ.33.72 కోట్లు ముఖ్యమంత్రి జమ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అన్నమయ్య జిల్లాలో జగనన్న వసతి దీవెన పథకం కింద ఎస్సీ సంక్షేమం కింద 4,540 మంది విద్యార్థులకు 4,199 మంది తల్లుల ఖాతాల్లో రూ.4.32 కోట్లు, ఎస్టీ సంక్షేమం కింద 1072 మంది విద్యార్థులకు 978 మంది తల్లుల ఖాతాల్లో రూ.1.02 కోట్లు, బీసీ సంక్షేమం ద్వారా 13,655 మంది విద్యార్థులకు 12,503 మంది తల్లుల ఖాతాల్లో రూ.13.17 కోట్లు, ఈబీసీ కింద 4,896 మంది విద్యార్థులకు 4,618 మంది తల్లుల ఖాతాల్లో రూ.4.81 కోట్లు, ముస్లిం మైనార్టీ కింద 5,215 మంది విద్యార్థులకు 4770 మంది తల్లుల ఖాతాల్లో రూ.5.06 కోట్లు, కాపు సంక్షేమం కింద 5,396 మంది విద్యార్థులకు 5,050 మంది తల్లుల ఖాతాల్లో రూ.5.24 కోట్లు, క్రిస్టియన్ మైనార్టీ కింద 612 మంది విద్యార్థులకు 57 మంది తల్లుల ఖాతాల్లో రూ.6.07 లక్షలు జమ చేశారని వివరించారు. జగనన్న వసతిదీవెన పథకాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. అంతకు ముందు జగనన్న వసతిదీవెన పథకానికి సంబంధించిన మెగా చెక్కును విద్యార్థులు, విద్యార్థుల తల్లులకు అందజేశారు.



నా పేరు ఆర్.సాయమ్మ, పోరుమామిళ్ల మండలం అక్కలరెడ్డిపల్లె గ్రామంలో ఉంటున్నాము. అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణం డైట్‌కాలేజీలో డీఈడీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాను. మా చదువులపై ఎక్కువగా సీఎం జగన్ ఆలోచిస్తున్నారు. మాకు అండగా నిలిచేందుకు ఆర్థికసాయం అందజేయడం అభినందనీయం.



నా పేరు బి.శివజ్యోతి, నాన్న పేరు బి.నరసింహులు. వ్యవసాయంచేస్తున్నారు. రాయచోటి పట్టణంలోని వైవి నాగిరెడ్డి డిగ్రీ కాలేజ్‌లో బీఎస్సీ సెకండియర్ చదువుతున్నాను. జగనన్న అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతిదీవెన లాంటి పథకాలతో విద్యారంగానికి రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్న పెద్దపీట వేస్తున్నారు.



నా పేరు పి.శివరాణి, వీరబల్లి మండలం సానిపాయిగ్రామం. అన్నమయ్య జిల్లా, రాయచోటి షిర్డీ సాయి మహిళా డిగ్రీ కాలేజీలో బీకాం మొదటి సంవత్సరం చదువుతున్నాను. నాన్న పి.చిన్న సిద్దయ్య కూలి పని చేస్తూ నన్ను చదివిస్తున్నాడు. పేదరికంతో ఎవరు చదువు నిలిపివేయికూడదన్న ముఖ్యమంత్రి జగనన్న ఆశయం చాలా గొప్పది.

క్లుప్తంగా

యువకుడిపై దాడి

మదనపల్లె : ఓ యువతిని ప్రేమించాడని యువకుడిపై యువతి కుటుంబ సభ్యులు దాడి చేసి గాయపరచిన సంఘటన మంగళవారం రాత్రి కురబలకోట మండలంలో జరిగింది. తెట్టు పంచాయతీ మండెంవారిపల్లెకు చెందిన మస్తాన్‌రెడ్డి (25) స్థానికంగా ఉన్న ఓ యువతిని ప్రేమించాడు. ఆ విషయం సదరు యువతి కుటుంబ సభ్యులకు తెలిసింది. దీంతో రాత్రి మస్తాన్‌రెడ్డి ఒంటరిగా గ్రామానికి వెళుతుండగా మార్గమధ్యంలో కాపుకాసి యువతి కుటుంబ సభ్యులు దాడి చేశారు. దాడిలో బాధితుడి చేయి నరకడంతో తీవ్రగాయమైంది. వారి నుంచి చాకచక్యంగా తప్పించుకున్న బాధితుడు మదనపల్లె జిల్లా ప్రభుత్వాసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నాడు. ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టిప్పర్ ఢీకొని వృద్ధుడి మృతి


మృతి చెందిన వేలాయుధం

మదనపల్లె : రోడ్డు దాటుతుండగా టిప్పర్ ఢీకొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన బుధవారం కురబలకోట మండలంలో జరిగింది. వివరాలు... కేరళ రాష్ట్రానికి చెందిన వి.వేలాయుధం (75) కొంతకాలం క్రితం ఉపాధి నిమిత్తం కుటుంబంతో కలిసి కురబలకోట మండలంలోని అంగళ్లు గ్రామానికి వలస వచ్చారు. స్థానికంగా స్థిర నివాసం ఏర్పరచుకుని టీ దుకాణం నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. మృతునికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు. ఈ క్రమంలో బుధవారం అంగళ్లులో రోడ్డు దాటుతుండగా ఎదురుగా వేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొంది. ప్రమాదంలో వేలాయుధం తీవ్రంగా గాయపడటంతో గమనించిన స్థానికులు బాధితున్ని 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమంగా మారడంతో మృతి చెందాడు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ముగ్గురు వ్యక్తులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వివరాలు.. మదనపల్లె మండలం చిప్పిలి గ్రామానికి చెందిన చంద్రశేఖర్(30) ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవిస్తున్నాడు. ఈ క్రమంలో భార్య తనపై తాలూకా పోలీస్‌స్టేషన్‌లో వేధింపుల కేసు పెట్టడంతో మనస్తాపం చెంది బుధవారం పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అదే విధంగా పట్టణంలోని అనపగుట్టకు చెందిన ఇంతియాజ్ (27) పెయింటర్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. ఇటీవల భార్య అలిగి పుట్టింటికి వెళ్లిపోవడంతో మనస్తాపం చెంది నిద్రమాత్రలు మింగి బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అదే విధంగా పట్టణంలోని నీరుగట్టువారిపల్లెకు చెందిన రవీంద్ర (20)చేనేత కార్మికునిగా జీవిస్తున్నాడు. కుటుంబ కలహాలతో గులికల మందు తిని బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు బాధితుల్ని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు.

బ్రహ్మంగారిమఠం.. శోభాయమానం

- నేటి నుంచి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజోత్సవాలు
- ఆరు రోజులపాటు నిర్వహణ
- పలు రాష్ట్రాల నుంచి రానున్న భక్తులు


ఆలయం ముందు వేసిన పందిరి

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలోని శ్రీజగద్గురు మద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి క్షేత్రం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. స్వామి ఆరాధన గురుపూజోత్సవాల సందర్భంగా నూతన శోభ సంతరించుకుంది.

- శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి క్రీ.శ.1693నకు సరియగు శ్రీముఖ నామ సంవత్సర వైశాఖ శుద్ధ దశమినాడు సజీవ సమాధినిష్ఠ వహించారు. అప్పటి నుంచి ఏటా ఆరాధన గురుపూజ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. గురువారం నుంచి మే 2వ తేదీ వరకు ఆరు రోజులపాటు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా రోజూ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రముఖులచే హరికథా కాలక్షేపం ఉంటుంది. కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించనున్నాయి.
- స్వామి సజీవ సమాధి నిష్ఠ వహించిన వైశాఖ శుద్ధ దశమి నాడైన ఈనెల 30న ప్రధాన ఘట్టం ఉంటుంది. దీక్షాబంధనాలంకారోత్సవంలో స్వామి యోగ నిద్రమూర్తియై భక్తులకు దర్శనమిస్తారు. మాలధారులు ఇరుముడి సమర్పిస్తారు. సాయంత్రం కందిమల్లయ్య పురసంస్థాన ఆస్థాన విద్వాంసులు నిగమాగమ కళాకోవిద మహోపాధ్యాయ డాక్టర్ పెదపాటి నాగేశ్వరరావు ఉపన్యాసం ఉంటుంది. రాత్రి నంది వాహన గ్రామోత్సవం ఉంటుంది.

ఉత్సవ కార్యక్రమాల వివరాలు

మొదటి రోజు ఈనెల 27న రాత్రి శేష వాహనోత్సవం, 28న రాత్రి గజవాహనోత్సవం, 29న రాత్రి నరనంది ఉత్సవం, 30న మధ్యాహ్నం దీక్షాబంధనాలంకారోత్సవం, రాత్రి నంది ఉత్సవం, మే 1న సాయంత్రం బ్రహ్మరథోత్సవం, రాత్రి గజవాహనోత్సవం, మే 2న మధ్యాహ్నం మహాప్రసాద వినియోగం ఉంటుంది.

పెద్ద ఎత్తున తరలిరానున్న భక్తులు

ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు. స్వామి సజీవ సమాధి నిష్ఠ వహించిన పవిత్ర దినమైన వైశాఖ శుద్ధ దశమి నాడు (ఈనెల 30) అశేష సంఖ్యలో జనం వస్తారు. భక్తుల కోసం దేవాదాయశాఖ అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. నిత్య అన్నదాన పథకాన్ని నిర్వహిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ సంస్థ ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతుంది.

ఏర్పాట్లు పూర్తి



ఆరాధనోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. సత్రాలు, అతిథి గృహాలతోపాటు తాత్కాలిక వసతులు కల్పిస్తున్నాం. అధికారులు, సిబ్బందికి భక్తులు సహకరించాలి. అందరం కలిసికట్టుగా ఉత్సవాలను విజవంతం చేయాలి.

– సి.శంకర్‌బాలాజీ, ఫిట్‌పర్సన్, వీరబ్రహ్మేంద్రస్వామి మఠం

సోమశిల బ్యాక్‌వాటర్‌లో.. 'పల్లాగట్టు' ఐలాండ్!


బోటులో వెళుతున్న జిల్లా ఉన్నతాధికారుల బృందం


సోమశిల బ్యాక్‌వాటర్‌లో కురుగుంటపల్లె-కొండమాచుపల్లె గ్రామాల మధ్యలో ఉన్న పల్లాగట్టు

- ఐలాండ్‌కు పర్యాటకశోభ
- కోనాపురం నుంచి బోటుషికారుకు అనుకూలం
- జిల్లా కలెక్టర్ ఆదేశాలతో కదిలిన అధికారుల బృందం
- బ్యాక్‌వాటర్‌లో పయనం.. ఐలాండ్ పరిశీలన

రాజంపేట : సోమశిల బ్యాక్‌వాటర్‌లో 'పల్లాగట్టు' ఐలాండ్ వెలుగులోకి వచ్చింది. ఈ ఐలాండ్ దశాబ్దాల కిందట సోమశిల బ్యాక్‌వాటర్‌తో పూర్తిగా మునిగిపోయిన కురుగుంటపల్లె-కొండమాచుపల్లె గ్రామాల మధ్యలో ఉంది. పల్లాగట్టు చుట్టూ వెనుక జలాలు ఉండటంతో ఒక దీవిని తలపించేలా ఉంటుంది.

20 కిలోమీటర్ల మేర..

పల్లాగట్టు ప్రాంతం 20 కిలోమీటర్ల మేర విస్తరించబడివుంది. దీవిగా ఉండే ఈ ప్రాంతం స్థానికంగా పరిమితమైన సంగతి తెలిసిందే. ఇప్పుడు పర్యాటక శోభను కల్పించేందుకు పల్లాగట్టును సందర్శించిన అధికారులు ఐలాండ్‌ను వెలుగులోకి తీసుకొచ్చారు.

జిల్లా కలెక్టరు ఆదేశాలతో ..

ఈనెల 25న ఆహ్లాదతీరం..ఆనందదాయకం అనే శీర్షికన సాక్షిలో ప్రత్యేక కథణం ప్రచురితమైన సంగతి విధి తమే. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టరు ఆదేశాలతో సోమ శిల అందాలను పర్యాటకులు వీక్షించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఉన్నాతాధికారుల బృందంను బ్యాక్‌వాటర్ పరిశీలనకు పంపారు. కోనాపురం నుంచి సోమశి ల వెనుకజలాలు పల్లాగడ్డ ఐలాండ్‌ను సందర్శించారు. పరిశీలన చేశారు. పర్యాటకపరంగా అభివృద్ధి చేయడానికి అనువైన ప్రదేశంగా గుర్తించారు..ఈ క్రమంలో మునిగిపోయిన మరో గ్రామంలో యల్లంపేట వద్ద ఐలాండ్ ఉంది. అయితే అది పర్యాటకులకు అంతవీలుగా ఉండదనే భావనకు అధికారులు వచ్చారు.

పరిశీలించిన అధికార్లబృందం..

జిల్లా నీటిపారుదలశాఖ సూపరింటెండెంట్ ఇంజనీరు కృష్ణమూర్తి , జిల్లా పర్యాటకశాఖాధికారి మూరముట్ల నాగభూషణం ముంపుగ్రామమైన కోనాపురం (నందలూరు మండలం) నుంచి బోటులో బ్యాక్‌వాటర్‌లో విహరించారు. బ్యాక్‌వాటర్‌లో రెండున్నర కిలోమీటర్లు వెళ్లి ఐలాండ్‌గా ఉన్న పల్లాగట్టును పరిశీలించారు. ఈ బృందం వెంట అటవీశాఖకు చెందిన ఎఫ్ఎస్‌వో సావిత్రి, ఎఫ్‌బీవో కరీముల్లా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీటీఓ నాగభూషణం మాట్లాడుతూ పల్లాగట్టు ఐలాండ్ గుర్తించామన్నారు. పర్యాటక అభివృద్ధికి సంబంధించి నివేదికలను జిల్లా కలెక్టరుకు అందచేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు



ప్రమాదంలో గాయపడినవారు

సంబేపల్లె : చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై మండల పరిధిలోని మోటకట్ల సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలైన సంఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాలమేరకు.. రాయచోటికి చెందిన షేక్ సలీమ్, అక్క పర్వీన్, పక్రుద్దీలతో కలిసి ద్విచక్రవాహనంలో కలకడకు వెళ్లి తిరిగి రాయచోటికి వెళుతుండగా.. రాంబాబు అనే వ్యక్తి ద్విచక్రవాహనంలో రాయచోటికి వస్తున్న క్రమంలో ఇద్దరి ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. క్షతగాత్రులు సలీమ్, పర్వీన్, పక్రుద్దీన్, రాంబాబులను చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

పందులు అడ్డురావడంతో...


తీవ్రంగా గాయపడిన బాధితులు

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన కలికిరి మండలంలో బుధవారం రాత్రి జరిగింది. మహాల్‌కు చెందిన మహ్మద్‌షరీఫ్ (46) తన తల్లి ముంతాజ్ బేగం (70), కుమారుడు నవాజ్ (14)తో కలిసి స్కూటీ లో నిమ్మనపల్లె మండలం ముస్టూరు గ్రామానికి వ్యక్తిగత పనులపై బయలుదేరారు. స్వగ్రామం మహాల్ దాటిన కొద్దిసేపటికే ద్విచక్రవాహనానికి పందులు అడ్డు రావడంతో, స్కూటీ అదుపుతప్పి కిందపడడంతో అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి బాధితులను తరలించారు. పరీక్షించిన వైద్యులు మహ్మద్ షరీఫ్ తలకు తీవ్రగాయం కావడంతో మెరుగైన వైద్యం కోసం బాధితున్ని తిరుపతికి రెఫర్ చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీ: వ్యక్తికి తీవ్రగాయాలు

ఒంటిమిట్ట : మండలంలోని మండపంపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో గల వనమిత్ర సమీపాన ఉన్న జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని భూపాల బాబు అనే వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... వనమిత్ర సమీపాన జాతీయ రహదారిపై కాలినడకన వస్తున్న భూపాల బాబు అనే వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొందని.. దీంతో బాబుకు కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయన్నారు. ఇది గమనించిన స్థానికులు వెంటనే 108 వాహనంకు సమాచారం ఇచ్చి చికిత్స నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు వారు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మదనపల్లెలో లీగల్ మెట్రాలజీ అధికారుల తనిఖీ


పాప్‌కార్న్ ప్యాకెట్‌పై వివరాలు లేకపోవడంతో సిబ్బందిని ప్రశ్నిస్తున్న లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్

మదనపల్లె : పట్టణంలోని పలు దుకాణాలు, సినిమా థియేటర్ క్యాంటీన్‌లలో బుధవారం జిల్లా లీగల్ అండ్ మెట్రాలజీ అధికారులు దాడులు నిర్వహించారు. స్థానిక అప్పారావువీధి, బజారువీధి తదితర ప్రాంతాల్లో మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి తూకాల్లో వ్యత్యాసం, తక్కువ బరువు, ప్యాకెట్లపై ధరలు ముద్రించకపోవడం, తయారీదారుని చిరునామా లేకపోవడాన్ని గుర్తించారు. బియ్యం ప్యాకెట్లపై 24 కిలోలు ఉన్నట్లు ప్రింట్ చేసినప్పటికీ తూకం వేస్తే తక్కువ బరువు ఉన్నట్లు గుర్తించారు. చక్కెర ప్యాకెట్లు, పప్పుధాన్యాలు, ఇతర నిత్యావసర వస్తువులకు సంబంధించి ప్యాకెట్లపై తయారీదారుని పేరు, బరువు, ధర లేకపోవడం, హార్డ్‌వేర్ దుకాణాల్లో నిబంధనలు అతిక్రమించడాన్ని గుర్తించి 6 కేసులు నమోదు చేస్తూ.. రూ.46వేలు జరిమానా విధించారు. పట్టణంలోని సినిమా థియేటర్లలోని క్యాంటీన్లలో ఆహారపదార్థాలు అధిక ధరలకు విక్రయిస్తున్నారన్న ఫిర్యాదుపై మార్వారివీధిలోని ఓ థియేటర్ క్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నపాటి పొట్లంలో పాప్‌కార్న్ రూ.40, ఆనియన్ రింగ్స్, చిప్స్ ప్యాకెట్లపై తయారీదారుడి పేరు, తూకానికి సంబంధించిన వివరాలు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే సినిమా థియేటర్ క్యాంటీన్‌లో నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరుపుతున్నట్లు గుర్తించినప్పటికీ కేసులు నమోదుచేయకుండా కేవలం సిబ్బందిని హెచ్చరించి విడిచిపెట్టారు. ఈ విషయమై లీగల్‌మెట్రాలజీ అధికారి నాగరాజును వివరణ కోరితే... డీసీ, ఉన్నతాధికారులకు విషయం తెలిపితే వారు మొదటిసారి కేవలం హెచ్చరించి వదిలేయమన్నారని, రెండోసారి తనిఖీల్లో పట్టుబడితే కేసు నమోదుచేయాల్సిందిగా చెప్పారని తెలిపారు.

కోడిపుంజు కోసం వెళ్లి వస్తూ...

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


సయ్యద్ మస్తాన్ మృతదేహం

రాయచోటిటౌన్ : ఫ్రెండ్ దగ్గర కోడి పుంజు కోసం వెళ్లి తిరుగు ప్రయాణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో సయ్యద మస్తాన్ (30) అక్కడికక్కడే మృతి చెందాడు. బుధవారం రాత్రి జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ట్రాఫిక్ ఎస్ఐ ఎస్ఎండీ రఫీ తెలిపారు. రాయచోటి పట్టణ పరిధిలోని పీటీఎం పల్లెకు చెందిన మదార్ సాహెబ్ మూడవ కుమారుడు సయ్యద్ మస్తాన్ వీరబల్లె మండల కేంద్రంలోని చాన్‌బాషకు ఫ్రెండ్. ఫ్రెండ్ దగ్గర కోడి పుంజు ఉందని తెలుసుకొని కోడి పుంజు కోసం వెళ్లాడు. అయితే వెళ్లే సమయానికి ఫ్రెండ్ లేకపోవడంతో తిరిగి ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో మామిడి కాయలు కొనుగోలు చేసి స్కూటర్‌పై ఉంచుకొని వచ్చాడు. బండోళ్ల మిట్ట రెండవ మలుపు వద్ద స్కూటర్ కంట్రోల్ కాకపోవడంతో రాళ్ల గుట్టను ఢీకొట్టాడు. ఈ దుర్ఘటనలో సయ్యద్ మస్తాన్ అక్కడికక్కడే మృతి చెందాడు. మస్తాన్ మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు ఎవరూ రాకపోవడంతో చివరికి మానవత సేవా సంస్థ వారి వాహనం వచ్చి తీసుకెళ్లారు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ ఎస్ఐ తెలిపారు.

కర్నూలు, అనంత జట్ల విజయం


సౌత్‌జోన్ టీ-20 చాంపియన్‌గా నిలిచిన అనంతపురం జట్టు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్న ఏసీఏ సౌత్ జోన్ టీ-20 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో కర్నూలు, అనంతపురం జట్లు విజయం సాధించాయి. బుధవారం ఉదయం నిర్వహించిన మ్యాచ్‌లో కర్నూలు, చిత్తూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన చిత్తూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 170 పరుగులు చేసింది. జట్టులోని ఇ. ధరణికుమార్ నాయుడు 65 పరుగులు చేశాడు. కర్నూలు బౌలర్ ఆంజనేయులు 2 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 18.1 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 173 పరుగులు చేసింది. జట్టులోని గిరినాథ్ 32 పరుగులు చేశాడు. దీంతో కర్నూలు జట్టు 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

అనంతపురం జట్టు విజయం..

మధ్యాహ్నం నిర్వహించిన మ్యాచ్‌లో కడప, అనంతపురం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన అనంతపురం జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 18.1 ఓవర్లలో 155 పరుగులకే ఆలౌట్ అయింది. జట్టులోని వంశీకృష్ణ 31, హరిశంకర్‌రెడ్డి 29, నరేశ్‌రెడ్డి 29 పరుగులు చేశారు. అనంతపురం బౌలర్లు దీపక్ 3, షోయబ్ ఖాన్ 3 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 18.4 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 158 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని రాజుకుళ్లాయప్ప 42 పరుగులు చేశాడు. కడప బౌలర్లు హరిశంకర్‌రెడ్డి 2, మహమ్మద్ రఫీ 2 వికెట్లు తీశారు. దీంతో అనంతపురం జట్టు 1 వికెట్ తేడాతో విజయం సాధించింది. దీంతో సౌత్‌జోన్ టీ-20 మ్యాచ్‌లు ముగిశాయి. కాగా ఆడిన అన్ని మ్యాచ్‌ల్లో విజయం సాధించి పాయింట్ల పట్టికలో అనంతపురం జట్టు అగ్రస్థానంలో నిలిచి సౌత్‌జోన్ చాంపియన్‌గా నిలిచింది.

అశ్వ వాహనంపై చెన్నకేశవుడు


అశ్వ వాహనంపై దర్శనమిస్తున్న చెన్న కేశవుడు

వల్లూరు : పుష్పగిరి శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వామి అశ్వ వాహనంపై కొలువు దీరి భక్తులకు దర్శన మిచ్చారు. మంగళ వాయిద్యాలు, దివిటీల వెలుగులతో కొండపై నుండి స్వామి వారిని పెన్నా నది మీదుగా పల్లకిలో మోస్తూ గ్రామంలోని మాడ వీధులలో ఘనంగా ఊరేగించారు. మొదట శ్రీ కామాక్షీ వైద్యనాథులు తిరుచ్చి వాహనంపై కొలువు దీరి భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం స్వామి వారి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీ చెన్న కేశవ స్వామి ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకులు అఖిల్ దీక్షితులు ఆధ్వర్యంలో యాగ శాల పూజలను, వివిధ హోమాలను నిర్వహించారు. బలి హరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వామి వారికి, లక్ష్మీదేవికి ప్రత్యేక అలంకరణ చేశారు. ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు సుమంత్ దీక్షితులు, చెంచు సుబ్బయ్య స్వామి పాల్గొన్నారు.

పుష్పగిరిలో నేడు చక్రస్నానం

పుష్పగిరి బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం ఉదయం 8-30 గంటలకు వైద్యనాథ స్వామి త్రిశూలం, చెన్న కేశవ స్వామి సుదర్శన చక్రాల స్నానం జరుగుతుంది. అనంతరం రెండు ఆలయాల్లో పూర్ణాహుతి, ధ్వజ అవరోహణం కార్యక్రమాలు జరుగుతాయి. సాయంత్రం 6 గంటలకు శ్రీ లక్ష్మీ చెన్న కేశవ ఆలయంలో పుష్పయాగం జరుగుతుంది.

పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు



సాక్షి రాయచోటి : పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఆర్. గంగాధర్‌రావు పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రహదారి భద్రతలో భాగంగా తీసుకున్న, తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. అలాగే విచారణ దశలో ఉన్న కేసులను త్వరితగతిన విచారించి సంబంధిత కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. మహిళలపై నేరాలు, రాబరీ, డెకాయిట్ కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా మార్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసకోవాలన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధానికి పకడ్బందీ చర్యలు చేపట్టడంతో పాటు నిగా పెంచాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ సమాశంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పురస్కారాలకు రైతుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

- మే 10లోపు చేసుకోవాలి
- కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య

కడప అగ్రికల్చర్ : ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి ఏటా జూన్ 12వ తేదీన రైతులకు రాష్ట్రస్థాయి పురస్కారాలను అందించడం జరుగుతుందని కృషి విజ్ఞాన కేంద్ర ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య తెలిపారు. జిల్లాలో ఆసక్తి ఉన్న రైతులు మే 10వ తేదీలోపు రాష్ట్రస్థాయి పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అభ్యుదయ రైతుల అద్వితీయ సేవలకు, వ్యవసాయంలోని నూతన ఆలోచనలకు, ఆవిష్కరణలకు గుర్తింపుగా జూన్ 12వ తేదీన రాష్ట్రస్థాయి పురస్కారాలకు అందజేస్తారన్నారు. ఇందులో భాగంగా ప్రతిభచాటిన రైతులకు ప్రశంసాపత్రంతోపాటు ధ్రువీకరణ పత్రం, రూ. 25 వేల నగదు అందజేస్తారన్నారు. 2023 సంవత్సరానికి ఆసక్తి గల రైతు సోదర, సోదరీమణులు మే నెల 10వ తేదీలోపు తమ దగ్గరలోని కృషి విజ్ఞానకేంద్రం, ఏరువాక కేంద్రం, వ్యవసాయ పరిశోధనస్థానంలో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రాయలసీమ ప్రాంతం నుంచి ఒక్క ఉత్తమ రైతును ఎంపిక చేస్తారని తెలిపారు. ఈ పురస్కార ఎంపికకు కొన్ని ప్రమాణాలు ఉంటాయని తెలిపారు.

ప్రమాణాలు ఇలా...

- వ్యవసాయ సాగులో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని, పద్ధతులను, వ్యవసాయ నిర్వహణ వ్యూహాలను అద్భుతంగా ప్రదర్శించిన రైతులు.
- రైతులకి లేదా రైతు సమాజానికి అదనపు ఆదాయాన్ని చేకూర్చిన రైతులు.
- ఉత్తత్తి వనరులను, సహజ వనరులను ఆదా చేసిన రైతులు.
- సాంకేతిక అవరోధాలను నిర్మూలించిన రైతులు.
- చీడ, పీడల, తెగులు వ్యాప్తి నివారణకు కొత్త సాంకేతిక జోక్యాలను ఏర్పరిచిన రైతులు.
- వ్యవసాయం, పశుసంపద నుంచి ఆదాయాన్ని మెరుగుపరిచే నిర్వహణ పద్ధతులలో సమూల మార్పులు తెచ్చిన రైతులు ఈ పురస్కారానికి అర్హులని తెలిపారు.
- అలాగే పై అంశాలలలో విశేషమైన కృషి చేసిన మహిళలకు ప్రత్యేక పురస్కారాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఒక ఉత్తమ మహిళా రైతుకు అందించనున్నట్లు తెలిపారు.
- చెరుకు పంటలో 2020-21, 2021-22 సంవత్సరానికిగాను అధిక దిగుబడి సాధించిన ముగ్గురు రైతులకు మూడు పురస్కారాలు అందించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల రైతులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విద్యాలయం వెబ్‌సైట్ ఊఊఊ.్చnజట్చ ు.్ఛఛీఠ.జీn లేదా సమీపంలోని కృషి విజ్ఞానకేంద్రం లేదా ఏరువాక కేంద్రాన్ని సంప్రదించాలని కేవీకే సమన్వయకర్త డాక్టర్ వీరయ్య తెలిపారు.